# బ్లాక్ కోబ్రా

కథ

"బుస్... స్స్స్... బుస్."

ఆఫ్రికన్ బ్లాక్ కోబ్రాకి కోపమొచ్చినా, సంతోషమొచ్చినా అదట్లాగే బుసలు కొడ్తుంది.

రెండున్నర అడుగుల చతురస్రాకారపు గాజు జాడీలో నుంచీ ఆ విష సర్పం రామూని చూసి ఆనందంతో పూర్తిగా పడగవిప్పి బుసకొట్టింది.

ఏయిర్ కండిషన్ చేయబడిన అదే రూములో అట్లాగే దాదాపు ఇరవై ఏడు గాజు జాడీలలో మెలికలు తిరుగుతున్న "బ్లాక్ మాంబా", పెన్సులర్ టైగర్ స్నేక్, కాళ్ళనాగు, కట్లపాము, రక్తపింజర, మిన్నాగు లాంటి ఎన్నో రకాల పాముల బుసలు బ్లాక్ కోబ్రా ముందు బలాదూర్ అవుతున్నాయి.

రాము కుడిచేతికి ప్రత్యేకమైన గ్లవుజ్ వేసుకుని పాములన్నింటికీ ఆహారం వేస్తూ వస్తున్నాడు.

రెండు చేతులకి ఖరీదైన, పొడవైన గ్లౌజ్ వేసుకుని రోషిణి సన్నని వడుం మీద చెయ్యేసి తన వెనకాలే శివప్రసాద్ వస్తూంటే అతని మనసేమీ బాగాలేదు.

రాము కోబ్రా దగ్గరికొచ్చాడు.

"స్టుపిడ్ ఫెలో! మనం చేసే బిజినెస్‌లో ఇలాంటి సెంటిమెంట్స్ పనికిరావు. కమాన్, లీవ్ ఇట్ టుమీ."

తన చేతిలోని పెద్ద పింగాణి పాత్రని శివప్రసాద్ అందుకున్నప్పుడు రాము కళ్ళు చెమ్మగిల్లాయి. జాలిగా కోబ్రా వైపు చూశాడతను.

కోబ్రా రాము కళ్ళల్లో పచార్లు చేస్తున్న భావాలను, ఆవేదనని అర్థం చేసుకున్నట్లుంది. భయంకరంగా మెలికలు తిరుగుతూ వెంటవెంటనే బుసలుకొడ్తూ శివప్రసాద్ వైపు తిరిగింది.

శివప్రసాద్ మెల్లిగా దళసరి పోర్సలిన్ మూతని తొలగించి ఆహారం వేస్తున్నట్లు నటిస్తూ గాజు జాడీలో చేయి పెట్టాడు.

బుస్!!!

కోబ్రా వేసిన కాటుకి శివప్రసాద్ ప్రాణాలను పోగొట్టుకునేవాడు. కానీ, అతనేసుకున్న ఖరీదైన గ్లవుజ్ సహాయంతో అతనొక్క క్షణం కూడా వృథా చేయలేదు. కోబ్రా మరోసారి నోరు తెరవకుండా దాని మూతిని గట్టిగా పట్టుకొని బయటకు తీశాడు.


ఆరడుగుల బ్లాక్ కోబ్రా అతని దేహాన్ని నిమిషంలో చుట్టేసింది. తోకతో అతని వడుము చుట్టూ దెబ్బ మీద దెబ్బ కొట్టసాగింది.

శివప్రసాద్ మాత్రం తన పట్టుని విడువలేదు. దాని తలని గట్టిగా పిండుతూ విషాన్ని తీసేసుకోవాలనే ఆకాంక్ష అతనిలో ద్యోతకమౌతూంది.

కానీ, ఒక్కసారి...

రాము వైపు తిరిగి చూశాడతను... సహాయం కోసం...

...అదే అతను చేసిన పొరపాటు... రెప్పపాటు కాలంలో కోబ్రా తన తలని బలంగా విదిలించి, అతని చేతిలోంచి తప్పించుకుని, అదే చేతిని చుట్టేసుకుని, బుసకొడ్తూ అతని మొహం మీద కాటేయబోయింది.



**ఎస్. సావిత్రి మోహనహరి**

రాము బిత్తరపోయాడు.

అయితే అతను కూడా ఓ క్షణం వృధా వేయలేదు. సరిగ్గా శివప్రసాద్ నుదుటిమీద పడుతున్న కోబ్రా కాటుకి అప్రయత్నంగా గ్లవుజ్ ధరించని ఎడమ వేతిని అడ్డు పెట్టాడు. అంతే, కోబ్రా వేసిన బలమైన కాటు రాము మణికట్టు పైన పడింది.

వేతికందిన పాము తప్పించుకుని పాలరాతి గచ్చుపైన చరచరా పాక్కుంటూ వెళ్ళిపోతుంటే, బాధగా మూల్గుతూ రాము మెలికలు తిరుగుతూ నేలమీదికి వొరిగిపోతుంటే, భయం, కోపం, విరాకుతో కాసేపు శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు శివప్రసాద్.

రాము ఏమైనా ఫర్వాలేదు. కానీ తను వేస్తున్న "సీక్రెట్ బిజినెస్" ఎక్కడ దెబ్బతింటుందోనని గుబులు పుట్టుకొచ్చిందవిలో.

"యూ, బాస్టర్డ్! గెటప్. వెంటనే డాక్టరు దగ్గరకు వెళ్ళాలి."

మొరటుగా అతని చొక్కా పట్టుకొని లేపి వార్మింగ్ బ్యూటీ రోషిణి సహాయంతో గబగబా బయటకు తీసుకొచ్చి జీపులో పడేశాడతన్ని. అయితే శివప్రసాద్ జీపు స్టార్ట్ వేసేలోగా కోబ్రా చటుక్కున వెనుకనున్న 'స్టెప్నీ" మీదికెగిరి మట్టేసుకున్న సంగతి అతను గమనించలేదు.

శివప్రసాద్ నడుపుతున్న జీపు సరాసరి వూరవతలున్న మర్రిచెట్టు దగ్గరకొచ్చి ఆగింది.

కోబ్రా మెల్లగా నేలమీదికి జారి ముళ్ళపొదల వెనకాలకెళ్ళి పడగవిప్పి చూస్తూన్న విషయం కూడా అతను గమనించలేదు.

అతను రోషిణీ భుజం మీద చెయ్యేసి మరో వైపు చూస్తున్నాడు.

"సార్! నన్ను కాపాడండి. పదేళ్ళ నుంచి మిమ్మల్నే నమ్ముకుని బ్రతుకుతున్నాను. నేను చనిపోతే మా అమ్మకి దిక్కెవ్వరూ లేరు. దయ వేసి నన్ను కాపాడండి... అమ్మా! మీరైనా దయ తల్చండి. నన్ను కాపాడండి..."

రాము మెలికలు తిరిగిపోతున్నాడు. అతని నోట్లోంచి తెల్లటి నురగకారటం మొదలెట్టింది. శరీరం రంగు మారుతోంది.

శివప్రసాద్ జీపు దిగి తాపీగా సిగరెట్ వెలిగించాడు. అప్పుడతని మొహంలో జాలి అనేది ఏమాత్రం కనిపించటం లేదు. మౌనంగా, కర్కశంగా రామూని చూస్తూ నిల్చున్నాడు.

రాములో నిస్సత్తువ అంచెలంచెలుగా పెరిగిపోతూంది. ఒక పక్కకి ఒరిగి జీపు మీద్నుంచి దొర్లి నేలమీదికి పడ్డాడు. అట్లాగే మెల్లిగా భూమ్మీద పాక్కుంటూ వచ్చి శివప్రసాద్ పాదాల మీద తల పెట్టేశాడు.

కానీ, బూటు కాలితో విసురుగా కొట్టిన దెబ్బకి అతను వెల్లకిలా పడిపోయాడు. ఎడం చేత్తో రోషిణిని దగ్గరకు లాక్కుంటూ జీపువి వెనక్కి మరలిస్తున్న అతన్ని చూసి రాము నీరసంగా కళ్ళు తేలేశాడు.

కోబ్రా వేగంగా రాము దగ్గరకు వచ్చి నిల్చుంది. బుస్సుమని బుసకొట్టింది. మూత పడుతున్న కనురెప్పల్ని అతికష్టంగా విప్పి దాని వైపు చూశాడతను.

"కోబ్రా! నిన్ను ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నాను. నువ్వయినా నన్నిప్పుడు కాపా



దుకోలేవా?'' అన్నట్లున్న అతని కన్నీళ్ళు కణత ల పక్క నుంచి జారుతుంటే కోబ్రా తన నిస్సహాయతని తెల్పుతూ మరోసారి బుసకొట్టింది. మెల్లిగా అతని కాళ్ళ దగ్గరకెళ్ళి పడగతో సున్నితంగా అతని పాదాలను స్పృశించింది. అతని చుట్టూ మూడుసార్లు తిరిగింది. చివరికి అతను చివరి శ్వాస వదులుతుంటే పూర్తిగా పడగెత్తి నేలకేసి కొట్టింది... బలంగా.

కోబ్రా సమయం వృధా చేయకూడదనుకుంది. చకచకా పాకుతూ శివప్రసాద్ ఉన్న చోటికి వచ్చేసింది. గాజు జాడీల మధ్యలో నడుస్తూ... రోషిణితో సరసల్లాపాలు ఆడుతున్న అతన్ని చూసి పడగెత్తింది.

బుస్!!!

శివప్రసాద్ ఉలిక్కిపడ్డాడు. కోబ్రాని చూసి నిలువెల్లా వణికిపోయాడు. ఆ భయంలో రోషిణి చెయ్యందుకుని బయటకు పరుగెత్తాడు.

జీప్ స్టార్ట్ అయ్యేలోగా కోబ్రా యధావిధిగా స్టెప్నీ మీదెక్కి చుట్టచుట్టుకుని పడుకుంది.

బూట్లని విప్పకుండా ఫోమ్‌బెడ్ మీద వెల్లకిలా పడిపోయి పిచ్చిగా జుట్టుపీక్కున్నాడు. రోషిణి ఎప్పుడో మధ్యలోనే దిగిపోయింది.

''బుస్... స్స్... బుస్''

శివప్రసాద్ అదిరిపడ్డాడు. చటుక్కున లేచి మంచం మీదికి ఎగిరి కూర్చున్నాడు. ఎంక్వైటీతో అతను గదిలోని ప్రతి అంగుళాన్ని పరీక్షగా చూశాడు.

సరిగ్గా తలుపు చాటున కోబ్రా పడగెత్తి చూస్తోంది!!

శివప్రసాద్ స్పైనల్‌కార్డ్‌లో నుంచి వణుకు పుట్టుకొచ్చింది.


మంచం మీద లేచి నిల్చున్నాడు.

కోబ్రా శివప్రసాద్ వైపు తీక్షణంగా చూస్తోంది. అతను దాని వైపే చూస్తున్నాడు. మంచం ప్రక్కనున్న డ్రాయర్ సొరుగు నుండి పిస్తోలు తీయాలని ప్రయత్నించాడు. అతని ఆలోచనను కోబ్రా పసికట్టినట్టుంది. మరి కాస్త ఎత్తుగా లేచి పడగని అటూ ఇటూ వూపసాగింది. కదిలితే ఎగిరొచ్చి కాటేస్తుందేమోనని అట్లాగే ఉండిపోయాడతను.

''డాడీ!!'' డాలీ, తన ఒక్కగానొక్క కూతురు, తల్లిలేని పిల్ల. తన ప్రాణానికి ప్రాణం. లోపలికి వస్తే సరిగ్గా కోబ్రా కాటుకి అందేలా ఉంటుంది.

''డాలీ! నువ్వు రావొద్దు. అక్కడే వుండు'' గట్టిగా అరుస్తూ చెప్పాలనుకున్నాడు. కానీ, అతని నోటి నుంచీ మాట రావటం లేదు. ''తన కూతుర్ని కాపాడుకోవాలి. అంటే కోబ్రాని చంపాలి. ఎలా? ఎలా??'' అతను ఎన్నోవిధాలుగా

# సొంత డబ్బా



ఈ మధ్య గోవిందా తన హెయిర్ స్టయిల్ మేధావిలాగా ఉందని అందరు నన్ను పొగుడుతున్నారని సొంత డబ్బా వాయించుకుంటున్నాడు.

యాదవ్

ఆలోచిస్తున్నా అతని మైండ్ మాత్రం సక్రమంగా పనిచేయటం మానేసింది.

శివప్రసాద్ కంగారుపడుతూ బెడ్ దిగబోయాడు.

ఝుష్...!!!

కోబ్రా కళ్ళు నిప్పు కణికలై శివప్రసాద్‌ని గమనిస్తున్నాయి. అతను బెడ్ మీద నుంచి దాగలేకపోతున్నాడు. డాలీ లోపలికి వచ్చేస్తోంది. డాలీ లేత శరీరం మీద కోబ్రా కాటేస్తున్నట్లుగా ఊహించుకున్న అతను భయంతో అతికష్టంగా ''డాలీ!! లోపలికి రావద్దు, వెళ్ళిపో... వెళ్ళిపో'' అని బిగ్గరగా కేకవేశాడు.

డాలీ పకపక నవ్వుతూంది. అతను ఆశ్చర్యంగా కళ్ళు తెరిచాడు. బట్టలు మార్చుకోకుండా, బూట్లతో సహా మంచం మీద నిల్చున్న తీరుని చూసి బుగ్గలు నొక్కుకుంటున్న డాలీని అమాంతంగా ఎత్తుకుని గుండెలకి హత్తుకున్నాడు. పిచ్చిగా మాతృవిహీనురాలైన ఆ అమ్మాయి బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించాడు.

అప్పుడు గుర్తుకొచ్చిందతనికి కోబ్రా!

అదురుతున్న గుండెతో నలువైపులా చూశాడు.

కిటికీ కర్టెన్ దగ్గర బయటికి జారిపోతున్న బ్లాక్ కోబ్రా తాలూకు తోకని గమనించి రవ్వంత ధైర్యం తెచ్చుకుని నిట్టూర్పు విడిచాడతను.

శివప్రసాద్ పిస్తోలు తీసి జేబులో వేసుకున్నాడు. కోబ్రా తనని నీడలా వెంటాడుతున్నందుకు అతని మనసు పాడైపోయింది. తనింట్లో ఉంటే అది మళ్లీ వస్తుందనే అనుమానం, నమ్మకం ఏర్పడింది అతనిలో. కోబ్రా బ్రతక్కూడదు! దాన్ని ఎలాగైనా ట్రాప్ వేసి చంపాలి... ఎలా? ఎలా??

చటుక్కున అతనికి పాముల నర్సయ్య గుర్తుకొచ్చాడు. అతని సహాయంతో దాన్ని కదలకుండా చేసి దాని పడగలో ఐదు తూటాలను దూర్చి పారెయ్యాలనే ఆలోచన రాగానే శివప్రసాద్ మనసుకి రవ్వంత స్వాంతన కల్గింది.

అతనే మాత్రం ఆలస్యం చేయక డాలీని ఆయాకి అప్పజెప్పి జీపు దగ్గరకు పరుగెత్తాడు. పాముల నర్సయ్య దగ్గరకు వెళ్తున్న శివప్రసాద్ రవ్వంత మానసిక విశ్రాంతి కోసం మధ్య దారిలో రోషిణి బంగళా ముందుకెళ్ళి ఆపాడు.

రోషిణి కౌగిట్లో శారీరక ఆనందం పొందుతూ మధ్యమధ్యలో షాంపైన్ తాగుతున్న అతని కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడ్డాయి. అయినా అతనికి మనశ్శాంతి కల్గటం లేదు.

ఎన్నో ఏళ్ళ నుంచీ విషసర్పాల విషంతో రహస్య వ్యాపారం చేస్తూ లక్షలు ఆర్జించాడు. ఇప్పుడా పాము విషానికే భయపడి పిచ్చివాడిలా అయిపోతున్నాడతను.

బుస్!!!

శివప్రసాద్ అదిరిపడ్డాడు. అటూ ఇటూ చూశాడు. కోబ్రా కనిపించకపోయేసరికి ఉన్మాదంగా, భయం కొద్దీ, ఎక్సయిటింగ్‌తో మరో రెండు పెగ్గులు వేసుకున్నాడతను.

''బుస్... స్స్స్... బుస్!''

కోబ్రా బుసకొట్టినట్లు వినిపించింది. ఈసారి తను పొరపాటు పడలేదని తెలిసిపోయిందతనికి. మూడడుగుల దూరంలో కర్టెన్ ప్రక్కన పడగెత్తిన కోబ్రా కనిపించింది. జేబులోంచి పిస్తోలు కూడా తీయలేనంత దగ్గర్లో ఉందది.

అతనికి పిచ్చెక్కినట్టయింది.

''కమాన్, రోషీ! క్విక్... రోషిణి చెయ్యందుకుని బయటకు పరుగెత్తాడు. సాధ్యమైనంత వరకూ పాముల నర్సయ్య దగ్గరకు వెళ్ళాలని చకచకా గేరుమార్చి జీపుని ముందుకి పరుగెత్తించాడు ఆ మసక వెన్నెల రాత్రిలో.

మళ్ళీ... అక్కడే... అక్కడే అతను చేస్తున్న తప్పు. తన కంటే కోబ్రా చాలా తెలివైందని, తనకంటే వేగంగా వచ్చి జీపు వెనకాల సీటులో చుట్టచుట్టుకుని కూర్చున్న విషయం అతనికి తెలీదు.

మయూరి వీక్లీ

జీప్ సిటీ ఏరియా దాటి సరిగ్గా మర్రిచెట్టు దగ్గరికి రాగానే కోబ్రా మరోసారి భయంకరంగా బుసకొట్టింది. శివప్రసాద్ గుండె ఝల్లుమన్నది. సడెన్ బ్రేక్ కొట్టేశాడు. ఆ అదురుకి కోబ్రా మరికాస్త ముందుకి తూలి దెబ్బతిన్నది.

"బుస్... బుస్... బుస్... స్!!!"

కోబ్రా కోపంతో రెచ్చిపోయింది. బలంగా సీటు మీద ఉక్రోషంగా కాటేసింది.

శివప్రసాద్ వెనక్కి తిరిగి చూశాడు. పడగెత్తిన కోబ్రాని చూసి రోషిణి కూడా పూర్తిగా పిచ్చిదానిలా అయిపోయింది. అంతే. ఇద్దరు జీపు దిగి పరుగెత్తసాగారు.

కోబ్రా అంతకంటే వేగంగా పాకుతూ ముందుకెళ్ళి వాళ్ళకెదురుగా వెళ్ళి పడగెత్తింది. రోషిణి పూర్తిగా బెదిరిపోయింది. చటుక్కున వెనక్కి తిరిగి జీపెక్కి స్టార్ట్ చేసింది. శివప్రసాద్ మాటలు వినిపించుకోకుండా ఎక్సిలేటర్ నొక్కుతూ జీపు వేగాన్ని హెచ్చించింది.

కొన్ని క్షణాలలో జీపు లోయలోకి పడిన శబ్దం... ఆ తర్వాత పెద్ద ప్రేలుడు వినిపించింది శివప్రసాద్ కి.

ముంగిస... పాము ఒకరినొకరు చూసుకున్నట్లు చూసుకున్నారు.

ఎక్కడైతే రాము ప్రాణాలు విడిచాడో సరిగ్గా. అక్కడే... ఇప్పుడు శివప్రసాద్ నిల్చున్నాడు.

అతనిలో మొండిధైర్యం ఆవహించింది.

"యూ డెవిల్! నిన్నిక వదలి పెట్టను. నువ్వయినా బ్రతకాలి. నేనైనా బ్రతకాలి. కమాన్... కమాన్ యూ డర్టీ బాస్టర్డ్!"

కోబ్రా వైపు పిస్తోలు గురిపెట్టాడతను. అది తోకమీద నిల్చున్నట్లు పూర్తిగా నిటారుగా లేచి అతని వైపు చూడసాగింది. మసక వెన్నెల్లో దాని కళ్ళు రెండు నిప్పురవ్వల్లా గోచరిస్తున్నాయ్.

శివప్రసాద్ ట్రిగర్ నొక్కబోయాడు. కానీ, అంతకు ముందే... ఓ క్షణం ముందు... కోబ్రా గాలిలోకి లేచింది.

సూటిగా అతని నుదుటిమీద కసిగా కాటేసింది.

"అబ్బా!!!"

శివప్రసాద్ నేలమీదికి ఒరిగిపోయాడు. అతని చేతిలోని పిస్తోలు జారి నేలమీద పడిపోయింది

"బుస్.........."

కోబ్రా మరోసారి అతని ఎడం చేతి మీద కాటేసింది. కానీ, శివప్రసాద్ లో ప్రతీకార వాంఛ ప్రజ్వరిల్లుతూంది.

అతికష్టంగా పిస్తోలు అందుకున్నాడతను.

కోబ్రా పడగవైపు గురిపెట్టాడు

కోబ్రా కళ్ళు మరింత తీక్షణంగా, భయంకరంగా మారిపోయాయి.

పడగని వెనక్కి, ముందుకీ వూపసాగింది.

శివప్రసాద్ కళ్ళలో మసక తెరలు తెరలుగా కమ్ముకుంటోంది. ఒంట్లోనుంచి జారిపోతున్న శత్తువని అతికష్టంగా మళ్ళీ తెచ్చుకుంటూ కోబ్రా వైపు గురిపెట్టి కాల్చాడు.

"బుస్... థస్!!"


మరోసారి ఎగిరి అతని మొహం మీద తనివిదీరా కాటెయ్యాలనుకున్న కోబ్రా పడగలో నుంచి బుల్లెట్ దూరి అవతలి వైపుకి వెళ్ళిపోవటంతో అది సరిగ్గా శివప్రసాద్ గొంతుమీదికొచ్చి పడింది. దాని బరువుకి అతను నేల మీద వెనక్కి వెల్లకిలా పడిపోయాడు.

నిర్జీవంగా తన గొంతుమీదున్న బ్లాక్ కోబ్రాని తొలగించే శక్తి ఇప్పుడతనిలో లేదు. కోబ్రా విడిచిన విషం అతని శరీరంలోని అణువణువుని ఆక్రమిస్తూ అతన్ని అశక్తునిగా చేసేసింది.

నిస్సహాయంగా... నిస్సత్తువతో... ఆకాశం కేసి చూస్తున్న అతని కళ్ళు మరుక్షణంలో నిశ్శబ్దంగా నిలిచిపోయాయి.

కోబ్రా అక్కడే వుంది. అతను గిలగిల తన్నుకుంటూ ప్రాణాలు విడుస్తుంటే తృప్తిగా చూడాలన్నట్లుగా దాని బుసలు ఆ నిశ్శబ్దపు వాతావరణంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

## మరొక్క సినిమా




జితేంద్రను ఈ మధ్య పాత్రికేయులు మీరు సినిమారంగం నుండి ఎప్పుడు రిటైర్ అవుతున్నారు అని ప్రశ్నిస్తే 'మీ అబ్బాయిలు, అమ్మాయిలు పెద్దాళ్ళయ్యాక ఒక్క సినిమా నాది జూబ్లీ ఫంక్షన్ చేసుకోలేదు అది చేసుకున్నాక రిటైర్ అవుతాను అన్నాడు అయ్యేదెప్పుడో, ఈయనగారు పోయ్యేదెప్పుడో! ఐ మీన్ రిటైర్ అయ్యేదెప్పుడో!

—శ్రీధర్ కృష్ణ

## వ్రాతలో సవ్యసాచి అయిన సురేంద్ర

అహమ్మదాబాదుకు చెందిన సురేంద్ర అన్న వ్యక్తికి... రెండు చేతులతోనూ ఒకేసారి వ్రాయగల నైపుణ్యం ఉంది. ఇందులోనూ ఇతనిదో ప్రత్యేకమైన పద్ధతి. కుడిచేత్తో మామూలుగా అక్షరాలు వ్రాసుకుంటూ పోతూనే అదే సమయంలో ఎడమచేత్తో— ఆ అక్షరాలను మిర్రర్ ఇమేజ్— అంటే అద్దంలో చూస్తే ఎలా కన్పిస్తాయో అలా చకచకా వ్రాయగల్గటం ఈతని స్పెషాలిటి.

అంటే ఈ విధంగా మయూరి సచిత్రవార పత్రిక.



.. పై విధంగా ఒకేసారి రెండుచేతులతో నిముషానికి 20 మాటలు వరకూ పెన్సిల్ ను ఉపయోగించి వ్రాయగలడు. అంటే 20 మాటలు కుడిచేత్తోనూ, 20 మాటలు ఎడమచేత్తోనూ వ్రాయగలడన్న మాట. ఇటు వంటి అద్భుత ప్రతిభ గల వ్యక్తి ప్రపంచంలో మరొకరు ఉన్నట్లు ఎటువంటి దాఖలాలు లేవు.

## ఇరాక్ పేద దేశమైపోయింది

గల్ఫ్ యుద్ధంలో ఘోరపరాజయాన్ని చవి చూసిన ఇరాన్... ఈ రోజుకు కూడా ఏమాత్రం కోలుకోలేదు. గతకాలంలో ప్రజలకు పెట్రోలును ఉచితంగా సరఫరా చేయగల్గిన స్థాయిలో ఉండే ఇరాక్ ప్రభుత్వం ఈ రోజుక్కూడా తన ప్రజలకు కావలసినన్ని నీటిని సరఫరా చేయలేని దైన్యస్థితిలో ఉంది. ద్రవ్యోల్బణం పెరిగిపోయి దొంగనోట్ల చెలామణీ విపరీతంగా పెరిగిపోవటంతో... 10 దీనార్ల నోట్లకు పై విలువ గల నోట్లను దుకాణుదారులు పూర్తిగా తీసుకోవడం మానివేయటంతో డబ్బున్నవారి స్థితి కూడా మరింత ఇబ్బందికరంగా తయారయింది. విద్యుత్ సరఫరా ఇంకా పూర్తిగా పునరుద్ధరించబడక పోవటంతో పరిశ్రమలు కుంటుపడ్డాయి. యుద్ధానికి పూర్వం ఎంతో సంపన్నవంతులుగా సకల భోగభాగ్యాలు, విలాసాలు అనుభవించి ఇరాక్ ప్రజల నేటి దీన పరిస్థితి ఇదండీ.

— ముద్దా రమణమూర్తి